క్లుప్తంగా

బాధితులకు న్యాయం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఇళ్లు కోల్పోయిన ప్రజలకు న్యాయం చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు సత్తార్, రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. కేసీ కెనాల్ పక్కన రోడ్ల విస్తరణ పేరుతో పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఖాళీ చేయాలని అధికారులు తెలపడం సరి కాదన్నారు. 30 ఏళ్లుగా ఇక్కడ స్థలాలు కొని నివాసం ఉంటున్న వీరిని అకస్మాత్తుగా ఖాళీ చేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు కెసీ బాదుల్లా, గుర్రప్ప, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తా పుల్లారెడ్డికి ‘కీర్తి’ పురస్కారం


పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రిటైర్డ్ ఇంజనీరు, సాహితీవేత్త పుత్తా పుల్లారెడ్డిని పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం 2020 సంవత్సరానికిగాను కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రాచీన సాహిత్యం అంశంలో ఈయన్ను ఎంపిక చేశారు. హైదరాబాదు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళా మందిరంలో ఈనెల 28న పుత్తా పుల్లారెడ్డికి కీర్తి పురస్కారం అందజేయనున్నారు.

సందడిగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న దుర్గాప్రసాద్ తదితరులు

కడప కల్చరల్: సినీ హీరో రామ్‌చరణ్‌తేజ్ జన్మదిన వేడుకలను శనివారం కడప నగరం అప్సర థియేటర్‌లో సందడిగా నిర్వహించారు. జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పంద్రా రంజిత్‌కుమార్ బృందం నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీ దుర్గ ఆటో సంస్థల అధినేత దుర్గాప్రసాద్ హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. సంస్థ నగర అధ్యక్షులు హబీబుల్లా, శివరాం, అంజి, చిన్న, వెంకట సురేంద్ర, బోరెడ్డి నాగేంద్ర, సురేష్, బాలాజీ, శివ, ఆకుల గోపి; శేషు, థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనం గుంటూరు బాపనయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనం కమ్యూనిస్ట్ యోధుడు గుంటూరు బాపనయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కమ్యూనిస్ట్ యోధుడు గుంటూరు బాపనయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య నాలుగు సార్లు ఎమ్మెల్యే, రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేయడం జరిగిందన్నారు. సీపీఎం నాయకులు అన్వేష్, శ్రీనివాసులు రెడ్డి, గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీడీ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా పశు సంవర్ధక శాఖలో డీడీగా పని చేస్తున్న అచ్చన్న మృతి బాధాకరమని.. ఆయన మృతిపై న్యాయ విచారణ జరపాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దళిత ఉద్యోగి అచ్చన్న మృతిపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. డీడీ మృతి అనేక అనుమానాలకు దారి తీస్తోందన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కడపవ వైఎస్‌ఆర్ సర్కిల్: వివిధ రంగాల్లోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. పంటలకు మద్దతు ధర అమలు చేయడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి రిటైర్‌మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. దీంతో పాటు ఆయా సమస్యలపై నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు జయప్రదం చేయాలన్నారు. నాయకులు మనోహర్, శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్, గోపాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు

రైతు శిక్షణ కార్యక్రమంలో కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : వ్యవసాయ, పండ్ల తోటల సాగులో భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసుకోవాలని కృషి విజ్ఞానకేంద్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. శనివారం ఊటుకూరులోని కేవీకేలో భూసార పరీక్ష ఆవశ్యకత, మట్టి నమూనా సేకరణ పద్ధతిపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల మేరకు పంటల సాగు, ఎరువుల యాజమాన్య సూచనలు పాటించాలన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించడంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూమి సమతుల్యాన్ని కాపాడవచ్చని వివరించారు. ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయరంగంలో పర్యావరణ సమతుల్యత, పర్యావరణ స్థిరత్వం కోసం భూసార ఆధారిత సమగ్ర పోషక యాజమాన్యం ఎంతో అవసరం అన్నారు. భూసార ఆధారిత పంటల ఎంపికలో అధిక పంటల దిగుబడి అలాగే సాగుబడి ఖర్చుని తగ్గించుకోవచ్చన్నారు. సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి ఆరుతడి పంటలలోను, పండ్ల తోటలలోను భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే మట్టి నమూనా సేకరించి వలసిన సమయం, మట్టి నమూనాను సేకరించే పద్ధతి, మట్టి నమూనాను సేకరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా వివరించారు. శాస్త్రవేత్తలు ప్రత్యూష, శిల్పకళ, స్వామి చైతన్య, మహేష్‌బాబు, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యేతో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న విద్యార్థినులు

కమలాపురం : పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఉన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి పరిష్కరించారు. శనివారం గర్ల్స్ హైస్కూల్‌లో నీటి సమస్య ఉందని పలు పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి స్పందించిన ఆయన పాఠశాలకు చేరుకున్నారు. నీరు ఎందుకు రావడం లేదని ఇన్‌చార్జ్ హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పై అంతస్తులో ట్యాంకులకు నీరు ఎక్కడంలేదన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎస్ఏ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

దాదాపు 400 మంది విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పక్క నుంచే కుప్పూరువారిపల్లెకు వెళ్తున్న పైప్‌లైన్ నుంచి రెండు వాటర్ లైన్ కనెక్షన్లు ఇవ్వాలని స్థానిక నాయకులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులు ఇబ్బంది పడకూడదని వారికి సూచించారు. ఎమ్మెల్యే రాకను చూసిన విద్యార్థులంతా ఎమ్మెల్యేతో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. మీకేమైన సమస్యలున్నాయా? అని ఎమ్మెల్యే ప్రశ్నించగా నీటి సమస్య ఉందని పేర్కొన్నారు. రెండు రోజుల్లో మీకు సరిపడా నీళ్లు వస్తాయని చెప్పడంతో విద్యార్థినులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మంచి కవి వైసీవీ రెడ్డి


వైసీవీ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్:వైసీవీ రెడ్డిగా ప్రసిద్ధులైన ఎమ్మనూరు చిన్న వెంకటరెడ్డి సాహిత్యంలో గట్టి గింజలంత మంచి కవి అని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వైసీవీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించింది. తొలుత బ్రౌన్ కేంద్రం సంచాలకులు మల్లికార్జునరెడ్డి వైసీవీ రెడ్డి పెద్ద కుమారుడు ప్రతాప్‌రెడ్డి, బ్రౌన్ కేంద్రం సిబ్బందితో కలిసి వైసీవీ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వైసీవీ రెడ్డి సమగ్ర సాహిత్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వైసీవీ రెడ్డి పెద్ద కుమారుడు ప్రతాప్‌రెడ్డి , బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి ప్రసంగించారు. బ్రౌన్ కేంద్రం గ్రంథ పాలకులు హరిభూషణరావు పాల్గొన్నారు.

నవరస భరితం.. రమణుల రామాయణం


నాటకంలోని ఓ దృశ్యం


నాటకాన్ని తిలకిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : రామాయణంలో దాదాపు ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంది. వాటికి విభిన్నమైన మనస్తత్వం కనిపిస్తుంది. ముఖ్యంగా మహిళా పాత్రలకు విలక్షణత కనిపిస్తుంది. ఆ సూత్రం ఆధారంగా రామాయణంలోని మహిళ పాత్రలు, వాటి మనస్తత్వం, లోకంలో వాటి పట్ల గల ముద్ర గురించి పాత్రలే వివరిస్తూ సాగిన నాటకమే రమణుల రామాయణం. దాదాపు రెండున్నర గంటలపాటు పట్టు సడలకుండా నడిచి నవరస భరితంగా ప్రజలను ఆకట్టుకుంది. కడప నగరం హౌసింగ్‌బోర్డుకాలనీ శ్రీ కోదండ రామాలయం వసంత నవరాత్రి వేడుకల్లో భాగంగా నాల్గవరోజు శనివారం గృహిణులైన మహిళలు రామాయణంలోని మహిళా పాత్రధారులుగా వ్యవహరిస్తూ రమణీ రామాయణాన్ని ప్రదర్శించారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి దర్శకత్వ నిర్వహణలో ఈ నాటకం రామాయణ స్త్రీ పాత్రల హృదయాల ఆవిష్కరణగా సాగింది. దాదాపు 21 మంది మహిళా మణులు పాల్గొన్న ఈ నాటకంలో అనసూయగా సంస్కృతి ఉపాధ్యాయిని దామోదరమ్మ కీలకపాత్ర పోషించి నాటకాన్ని ఆద్యంతం రక్తి కట్టించారు. కార్యక్రమాల్లో భాగంగా ఉదయం మహిళలకు సంప్రదాయ వంటల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు 25 మందికి పైగా పోటీలో పాల్గొని రకరకాల రుచులను ఘుమఘుమలు కలిపి అందించారు. ఆదివారం ఉదయం రామాయణం నాకెందుకు నచ్చింది అంశంపై బాలబాలికలకు వక్తృత్వ పోటీ, సాయంత్రం రామాయణంలోని పాత్రల ధారణ పోటీ నిర్వహిస్తారు.

ఫొటోగ్రఫీతో చక్కటి ఉపాధి అవకాశాలు


ఫొటోగ్రఫీలో మెలుకువలు తెలియజేస్తున్న కెనాన్ ట్రైనర్

ఏఎఫ్‌యూ : ఫొటోగ్రఫీని కెరీర్‌గా ఎంచుకునేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన కెనాన్ ప్రొడీవీ సంస్థ ఫొటోగ్రఫీ శిక్షకుడు పి. అహ్మద్ తెలిపారు. కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వ విద్యాలయంలో కెనాన్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్కరోజు ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు ఫొటోగ్రఫీ వైపు రావడం శుభపరిణామమన్నారు. సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తూ ఆధునిక ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం కెమెరాల్లో వస్తున్న టెక్నాలజీ, వినియోగం, లేటెస్ట్ మోడల్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఫొటోగ్రఫీ కో–ఆర్డినేటర్ సతీష్, అహ్మద్, మెహర్, డా. సంపత్‌కుమార్, ట్రైనర్‌లు ఎస్. పర్వేజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించిన కమలాపురం వాసి


రవిశంకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కమలాపురం : స్థానిక సీఎస్‌ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్‌ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీకాం, సెంకడియర్ విద్యార్థి జి.రవిశంకర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించాడు. ఈనెల 15 నుంచి 18 వరకు చండీఘడ్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. దీంతో శనివారం స్థానిక ఆ కళాశాలలో వైవీయూ డిప్యూటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య కె.రామసుబ్బారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి శాలువ కప్పి సన్మానించారు. కరస్పాండెంట్ రూ.30వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు తప్పక ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్‌లు నరహరి, వినోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

800 సంఘాలకు వైఎస్సార్ ఆసరా విడుదల


నల్లింగాయపల్లె సచివాలయంలో సీఎం ప్రసంగాన్ని వీడియో ద్వారా తిలకిస్తున్న డ్వాక్రా మహిళలు

కమలాపురం : మండలంలోని 800 మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.6,53, 29,000 విడుదల అయినట్లు వెలుగు ఏపీఎం అపర్ణ తెలిపారు. శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి అర్హులైన మహిళల ఖాతాలకు నగదు జమచేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ వరుసగా మూడవ సారి మండలంలోని 800 సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల అయ్యాయన్నారు. ఈ నిధులతో మహిళలు వివిధ రకాల వృత్తి, వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనంలో మార్పులు సాధించారన్నారు. సీఎం ప్రసంగాన్ని అన్ని సచివాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినిపించామన్నారు. కార్యక్రమంలో వెలుగు, ఆశాలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు ఎంపిక


ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ కమ్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) 2022–23 సంవత్సరానికి విడుదల చేసిన ఫలితాల్లో కడప నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్)విద్యార్థులు ఎస్‌ఎండీ ఇర్ఫాన్, డి. వేదవర్ధన్, ఎన్. గీష్మాంజలి ఎంపికయ్యారు. వీరికి 9,10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సం వరకు సంవత్సరానికి 12 వేల చొప్పున మొత్తంగా రూ. 48 వేలు స్కాలర్‌షిప్ డబ్బులు అందనున్నాయి. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా పోషణ్ పక్వాడ ర్యాలీ



చిన్నచౌక్ సెక్టార్ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని చిన్నచౌకు సెక్టార్ పరిధి ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిత్ర ఫౌండేషన్ ప్రతినిధి నీరజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే చిరు ధాన్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు అధిక శాతం ప్రోటీన్లు కలిగిన పదార్థాలను తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు, పాలు అధికంగా తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారన్నారు. చిన్నారులకు కూడా పోషక పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాన్ని ఇవ్వాలన్నారు. అనంతరం ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ర్యాలీ చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అత్తపై అల్లుడి హత్యాయత్నం

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పటేల్‌రోడ్డులో నివాసం వుంటున్న గాలి రమాదేవి (50) అనే మహిళను శనివారం ఆమె అల్లుడు దాదిరెడ్డి శ్రీనివాసులరెడ్డి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన భార్య శిరీషను, తన అత్త రమాదేవి కాపురానికి పంపడం లేదని కక్షసాధింపు చర్యగా ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రమాదేవి ఇంటిలో ఒంటరిగా వున్న సమయంలో నేరుగా కత్తితో వెళ్లిన శ్రీనివాసులరెడ్డి ఆమె శరీరంపై విచక్షణా రహితంగా నరికాడు. ఆ సమయంలో రమాదేవి కుమార్తె శిరీష తన కుమార్తె చదువుతున్న పాఠశాలకు క్యారియర్ ఇచ్చేందుకు వెళ్లింది. శిరీష ఇంటికి రాగానే తన తల్లి రమాదేవి తీవ్రగాయాలతో పడివుంది. వెంటనే ఆమెను స్థానికులు, బంధువులు గుర్తించి కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ ఎస్ఐ ఎస్‌కే రోషన్ తెలియజేశారు. కాగా ఈ కేసులో నిందితుడు శ్రీనివాసులరెడ్డి డిఆర్‌డిఓలో సైంటిస్ట్‌గా పని చేస్తున్నాడు. గతంలో ఆయన కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వున్న ఓ మహిళా డాక్టర్‌పై దాడి చేసి గాయపరిచాడు. అప్పట్లో కడప ఒన్‌టౌన్‌లో ఇతనిపై కేసు నమోదై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

యువత చేతిలోనే దేశభవిత


- మత్తు పదార్థాల ఆలోచనే ప్రమాదకరం
- వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : ఆదర్శణీయమైన ప్రవర్తన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతో పాటు దేశ ఔన్నత్యానికి బాటలు వేస్తుందని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ జాతీయ, రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు సత్ప్రవర్తన, ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారని, డ్రగ్ ఫ్రీ విశ్వవిద్యాలయంగా వైవీయూ ఉందన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఎదురయ్యే సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ ‘డ్రగ్ ఫ్రీ కడప’ కావాలని ఆకాంక్షించారు. అనంతరం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రోఫిక్ సబ్ స్టాన్సిస్ యాక్ట్–1985 గురించి అవగాహన కల్పించారు. సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ ఎ. ప్రభాకర్‌రెడ్డి , రిమ్స్ సైక్రియాటిస్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. వెంకట్రాముడు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్.వి. కృష్ణకిశోర్ మాట్లాడుతూ మత్తు రహిత భారతావని యువత వల్లే సాధ్యమవుతుందన్నారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డా. టి. చంద్రశేఖర్, డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా. వి. లాజర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో సమయస్ఫూర్తి అవసరం

ఎన్‌వైకే జిల్లా కో–ఆర్డినేటర్ మణికంఠ


శిక్షణకు హాజరైన వారితో అధికారులు

వైవీయూ : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నేర్పుగా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ మణికంఠ సూచించారు. శనివారం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు ప్రజల్లో అవగాహన కోసం చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్రస్తుత పరిస్థితుల్లో గుండెసంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కమాండర్ శివకుమార్ మాట్లాడారు. అనంతరం వారు డెమో ప్రదర్శన నిర్వహించారు.

ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం


క్యాంపును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ క్యాంపు ప్రారంభమైంది. కడప నగరం శివానందపురంలో నిర్వహించిన క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్, వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడురోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపులో చేపట్టాల్సిన అంశాలను, ప్రణాళికను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై. సావిత్రి, అధ్యాపకులు పి. రవిశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పక్కీరుపల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును మానవత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం పక్కీరుపల్లెలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా పోషణ పక్షోత్సవాలు

ఏప్రిల్ 3 వరకు కార్యక్రమాలు


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళా శిశు సంక్షేమశాఖలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజారోగ్యమే పరమావధిగా ప్రభుత్వం పోషకాహారం అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు అందరి ఆరోగ్య రక్షణకు పలు పథకాలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ ఆహారంపై అవగాహన కల్పించేలా ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేది వరకు పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పక్షోత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అంగన్వాడీ కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

27న పోషకాహార ప్రాముఖ్యంపై పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, బుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారంపై సదస్సులు నిర్వహిస్తారు. 29న గర్భిణీలు, పాలిచ్చే తల్లుల కోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, డీహెచ్‌సీ వద్ద డైట్ కన్సల్టేషన్ శిబిరాలు నిర్వహిస్తారు. 30న మిల్లెట్ ఆధారిత సంప్రదాయ ఆరోగ్యకరమైన ఆహార వంట, సంప్రదాయ ఆరోగ్యకరమైన వంటకం సంబంధిత పోటీలను నిర్వహిస్తారు. 31న ఏఎన్‌ఎం, ఆశా, ఏఎస్‌డబ్ల్యూ, హెల్త్ సబ్ కమిటీ సభ్యులు, వీఓఎస్ తదితరులు ఇంటింటికి వెళ్లి పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు పరీక్షలు నిర్వహించి సలహాలు ఇస్తారు. ఏప్రిల్ 1న తల్లులకు అవగాహన కల్పించేలా న్యూట్రిగార్డెన్లకు ఎక్స్‌పోజర్ సందర్శన నిర్వహిస్తారు. మిల్లెట్ ఆధారిత వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇస్తారు.

3న ముగింపు శిక్షణ

ముగింపు వేడుకల్లో భాగంగా ఏడబ్ల్యూసీలో హెల్త్ బేబి షో నిర్వహిస్తారు. అన్ని పోటీల్లో విజేతలకు బహుమతులను అందిస్తారు.

> **సంపూర్ణ పోషణ ఆహారంపై అవగాహన**
>
> 
>
> జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ ఆహారంపై పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఏరోజుకారోజు కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ 3 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తాం . గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పక్షోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.
>
> – ఎంఎన్ రాణి, పీడీ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, కడప

వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు బలవర్ధకమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తోందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. మండలంలోని లింగాపురం–1 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా చిరుధాన్యాలపై మహిళలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ చిరుధాన్యాలతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు.